క్లుప్తంగా

చల్ల..చల్లగా..



ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న హనుమాన్ సేవా సంఘం యువత

జామి: మండలంలోని బలరాంపురం గ్రామ జంక్షన్ వద్ద గ్రామ హనుమాన్ యూత్ సేవా సంఘం ఆధ్వర్యంలో పాదచారులు, ప్రయాణికులకు మంగళవారం మజ్జిగ పంపిణీ చేశారు. ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో ప్రయాణికులు, పాదచారుల దాహార్తి తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేశామని నిర్వాహకులు తెలిపారు.

వృద్ధాశ్రమానికి వితరణ



రూ.11 వేలు అందజేస్తున్న శ్రీనివాసరావు

చీపురుపల్లి: పట్టణంలోని బాపూజీ వృద్ధాశ్రమంలో నిత్యాన్నదాన పథకం నిర్వహణకు గాను మండలంలోని ఇటకర్లపల్లి గ్రామానికి చెందిన మీసాల శ్రీనివాసరావు రూ.11 వేలు అందజేశారు. ఈ మేరకు వృద్ధాశ్రమంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు కోట్ల లక్ష్మణరావుకు నగదు అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, తమ గ్రామానికి చెందిన గొర్లె నారాయణమ్మ ఆమె భర్త వెంకటరమణ వర్ధంతి సందర్భంగా నగదు అందజేసినట్లు చెప్పారు.

ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడిగా 'మీసాల'



మీసాల వెంకటరమణ

చీపురుపల్లి రూరల్ (గరివిడి): విజయనగరంలో మంగళవారం జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడిగా మీసాల వెంకటరమణ ఎన్నికయ్యారు. ఈయన గరివిడి మండలం కుమరాం పాలవలస యూపీ స్కూల్‌లో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. అదేవిధంగా కొండశంభాం ఎంపీపీ స్కూల్ హెచ్ఎం ఏవీ శ్రీనివాస్‌ను అదనపు సెక్రటరీగా ఎన్నుకున్నారు.

ఓటేద్దాం..



అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

జామి: ప్రజల తలరాతను నిర్దేశించే శక్తివంతమైన ఆయుధం ఓటు అని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కళాజాత బృందం సూచించింది. మండల కేంద్రం జామిలో డీడీ సునీత ఆధ్వర్యంలో ఎస్ఈఈపీ (సిస్టమా టిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్, ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమంపై ప్రజలకు కళాజాత బృంద సభ్యులు మంగళవారం అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

గడ్డి వాములు దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం సంభవించిన అగ్ని ప్రమాదంలో ఇద్దరు రైతులకు చెందిన గడ్డి వాములు దగ్ధమయ్యాయి. రైతులు గంటా వీరప్ప, కొర్రాయి సూర్యనారాయణకు చెందిన గడ్డివాములకు తొలుత మంటలు వ్యాపించాయి. స్థానికులు గజపతినగరం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. పక్కనే గల మిగతా గడ్డి వాములకు మంటలు వ్యాపించకుండా చేశారు. రైతులకు సుమారు రూ.20 వేల నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక అధికారి ఎం.ఎస్.వి.రవి ప్రసాద్ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



మరుపల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గజపతినగరం రూరల్: మండలంలోని మరుపల్లి, మర్రివలస గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎన్నికల పరిశీలకులు హనీష్ చాబ్రా మంగళవారం పరిశీలించారు. కేంద్రాల్లో పూర్తిస్థాయి సదుపాయాలు కల్పించేలా దృష్టి సారించాలని ఆర్‌ఓ సూర్యకళకు సూచించారు. ఓటర్లకు అందుబాటులో తాగునీరు, వైద్యసదుపాయంతో పాటు నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు.ఆయన వెంట తహసీల్దార్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం,అభివృద్ధికి కేరాఫ్ సీఎం జగన్

- ఎన్నికల ప్రచారంలో విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి



కొత్తవలస జంక్షన్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, ఎంపీ అభ్యర్థి ఝాన్సీలక్ష్మి

కొత్తవలస: ప్రజా సంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈఐదేళ్లూ సుపరిపాలన సాగించా రని వైఎస్సార్‌సీపీ విశాఖపట్నం ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి అన్నారు. మండల కేంద్రం కొత్తవలస, తుమ్మికాపల్లి గ్రామాల్లో ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుతో కలిసి మంగళవారం రాత్రి ఎన్నికల ప్రచారం చేశారు. ఆయా గ్రామాల నాయకులు, ప్రజలు వారికి ఘనస్వాగతం పలికారు. కొత్తవల సలో రైల్వేస్టేషన్ నుంచి మూడురోడ్ల జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహిం చారు. ఈసందర్భంగా బొత్స ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసిందని, వివక్ష చూపకుండా గ్రామాలను అభివృద్ధి చేసిందని పేర్కొన్నారు. 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 99 శాతం సీఎం జగన్ అమలు చేశారని, అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా తాజాగా 2024 ఎన్నికల మేనిఫెస్టోను ఆయన ప్రకటించారని పేర్కొన్నారు. గ్రామసచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకు చేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు.వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమం,అభివృద్ధిని చూసి, మే 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను, ఎస్.కోట ఎమ్మెల్యే అభ్యర్థి కడుబండి శ్రీనివాసరావును గెలిపించాలని అభ్యర్థించారు.ఎమ్మెల్యే కడుబండి మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచామని, నాడు-నేడులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దామని చెప్పారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్‌ల భవనాలను నిర్మించామని, పలు గ్రామాలకు తారురోడ్లు వేశామని, ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేశామని వివరించారు. తనకు మరోమారు అవకాశం ఇస్తే శృంగవరపుకోట నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు.పార్టీ నియోజకవర్గ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, డీసీబీసీ చైర్మన్ వేచలపు చిన్న రామునాయుడు, నాయకులు డాక్టర్ కడుబండి మధు, గొరపల్లి శివ, మేలాస్త్రి అప్పారావు,గొరపల్లి రవికుమార్, విరోతి కొండలరావు, ఎంపీపీ గోపమ్మ,జెడ్పీటీసీ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ అభ్యర్థి ఝాన్సీలక్ష్మికి హారతులు పడుతున్న కొత్తవలస గ్రామ మహిళలు



కొత్తవలసలో నిర్వహించిన ప్రచారర్యాలీలో కార్యకర్తలు, అభిమానులు

కూటమికి ప్రజాదరణ కరువు



గుర్ల: వైఎస్సార్‌సీపీలో చేరిన పెద్దబంటుపల్లి వాసులతో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, బొత్స సందీప్

కొత్తవలస: తెలుగుదేశం,జనసేన,బీజేపీ కూటమికి ప్రజాదరణ లేదని వైఎస్సార్‌సీపీ విశాఖపట్నం ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, ఎస్.కోట ఎమ్మెల్యే అభ్యర్థి కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని తుమ్మికాపల్లి పంచాయతీ పరిధిలోని టీడీపీ,జనసేన పార్టీలకు చెందిన 60 కుటుంబాలు ఆ పార్టీలను వీడి బొత్స ఝాన్సీలక్ష్మి,ఎమ్మెల్యే కడుబండి సమక్షంలో కొత్తవలసలో వైఎస్సార్‌సీపీలో చేరారు.వడ్డిపేట, చాకలిపేట,యాతపేటకు చెందిన శీర అప్పలనాయుడు, నవీంద్రపాత్రో, జి.బాలకృష్ణ, సీతారాం తదితరులకు ఝాన్సీలక్ష్మి, కడుబండి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి మేనిఫెస్టోను ప్రజలు చీదరించుకుంటున్నారని,చంద్రబాబు, పవన్‌కల్యాణ్ సత్యదూర హామీలు ఇస్తూ ప్రజలను మోసంచేయా లని చూస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకులు తైనాల విజయ్‌కుమార్, వెలమకార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, ఎంపీపీ గోపమ్మ, జెడ్పీటీసీ శ్రీదేవి, తుమ్మికాపల్లి సర్పంచ్ విరోతి కొండలరావు పాల్గొన్నారు.



కొత్తవలస:తుమ్మికాపల్లి పంచాయతీ వాసులకు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ అభ్యర్థి ఝాన్సీలక్ష్మి,ఎమ్మెల్యే కడుబండి

పెద్దబంటుపల్లి నుంచి 20 కుటుంబాల చేరిక

గుర్ల: మండలంలోని పెద్దబంటుపల్లిలో 20 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో మంగళవారం చేరాయి. వారికి గ్రామంలో వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ డిప్యూటీ కో-ఆర్డినేటర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మాజీ ఎంపీటీసీ సారిపల్లి వెంకటరమణ,సారిపల్లి శంకరరావు, యాల్ల గౌరి, బోనెల గోవిందరావుతో పాటు మరో 17 కుటుంబాల వారు ఉన్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ తనయుడు సందీప్ పెద్దబంటుపల్లిలో ఇంటింట ప్రచారం నిర్వహించారు.

గజపతినగరం బరిలో 13 మంది



బొత్స అప్పలనరసయ్య
వైఎస్సార్‌సీపీ అభ్యర్థి

దత్తిరాజేరు: ఎమ్మెల్యే ఎన్నికలకు సంబంధించి గజపతినగరం నియోజకవర్గం బరిలో 13 మంది ఉన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు బొత్స అప్పలనరసయ్య(వైఎస్సార్‌సీపీ), కొండపల్లి శ్రీనివాస్ (టీడీపీ), చెల్లుబోయిన శ్రీను(బీఎస్పీ), డోల శ్రీనివాస్(కాంగ్రెస్), కాకర్లపూడి సంధ్య(పిరమిడ్), కిలపర్తి కుమార్‌రాజ్ (సమాజ్ వాది పార్టీ) కొత్తలి గౌరినాయుడు (నవ భార త నిర్మాణ సేవా పార్టీ),పెంట శంకరరావు(జై భీమ్‌రావ్ భారత్ పార్టీ), లెంక సూర్యారావు(జై మహాభారత్ పార్టీ), అప్పల నాయుడు కిలారి(ఇండిపెండెంట్), కూర్మినాయుడు గాదాపు(ఇండిపెండెంట్), తలుపుల శంకరరావు((ఇండిపెండెంట్), ములగాడ దుర్గారావు(ఇండిపెండెంట్). అభ్యర్థులకు ఆర్‌ఓ గుర్తులు కేటాయించారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి సహకరించండి



గురునాయుడును సన్మానిస్తున్న పాస్టర్లు

దత్తిరాజేరు: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి పాస్టర్లు, క్రైస్తవులు సహకరించాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య కుమారుడు గురునాయుడు కోరారు. టి.భూర్జవలసలో మండలంలోని వివిధ గ్రామాల చర్చి పాస్టర్లతో మంగళవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మే13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి విజయనగరం ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్‌ను, గజపతినగరం ఎమ్మెల్యే అభ్యర్థి బొత్స అప్పలనరసయ్యను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం పాస్టర్ల సంఘం అధ్యక్షుడు విక్టర్‌పాల్, పాస్టర్లు గురునాయుడును సత్కరించి, వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపారు.

సీఎం జగన్‌తోనే మహిళా సంక్షేమం



ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు

శృంగవరపుకోట: మహిళా సంక్షేమం, ఆర్థికాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని జీసీ సీ చైర్‌పర్సన్ స్వాతిరాణి, జెడ్పీటీసీ ఎం.వెంకటలక్ష్మి, సర్పంచ్‌లు ఎం.యామినీ దేవి, రంధి అరుంధతి, ఏఎంసీ డైరెక్టర్ డి.పార్వతి అన్నారు. వైఎస్సార్‌సీపీ ఎస్.కోట ఎమ్మెల్యే అభ్యర్థి కడుబండి శ్రీనివాసరావు, విశాఖపట్నం ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మికి మద్దతుగా మండలంలోని శివరామరాజుపేట గ్రామంలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వ హించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యాలని అభ్యర్థించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల కష్టాలు తెలిసిన వ్యక్తి సీఎం జగన్ అని అన్నారు. మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజి కంగా ఎదగాలంటే మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలని అన్నారు. వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, పోతనాపల్లి సర్పంచ్ కె.వెంకటరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, ఎస్.కోట పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ రహ్మాన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి



గుర్ల: చింతలపేటలో మాట్లాడుతున్న డీఎస్పీ చక్రవర్తి

గుర్ల: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అంతా సహకరించాలని చీపురుపల్లి డీఎస్పీ చక్రవర్తి ప్రజలను కోరారు. మండలం లోని చింతలపేట, గుజ్జింగివలసలో ఆయా గ్రామాల పెద్దలు, యువకులతో మంగళవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో తగాదాలు, గొడవలు జరగకుండా చూడాలని పెద్దలకు సూచించారు. ఎస్ఐ భాస్కరరావు , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



బొండపల్లి: గొల్లుపాలెం గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లక్ష్మణరావు

బొండపల్లి: ఎన్నికల కోడ్‌ను ప్రతి ఒక్కరూ పాటించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ కె.లక్ష్మణరా వు అన్నారు. మండలంలోని గొల్లుపాలెం గ్రామంలో ప్రజలకు ఎన్నికల కోడ్‌పై మంగళవారం సాయంత్రం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణం లో జరిగేలా ప్రజలంతా సహకరిం చాలని కోరారు. గొడవలు, తగాదాలు సృష్టించి కేసుల్లో ఇరుక్కోవద్దని, ప్రలోబాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును విని యోగించుకోవాలని సూచించారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు



పార్టీలో చేరిన వారితో బొత్స సందీప్

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గుర్ల మండలంలోని దేవునికనపాక పంచాయతీ పరిధిలోని కొర్నానపేట, ఇంటిపేట గ్రామాలకు చెందిన పలు టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీ నాయకుడు పొట్నూరు సన్యాసినాయుడు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో మంగళవారం చేరారు. గరివిడి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ధీరా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బొత్స సందీప్ సమక్షంలో వారంతా పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయా గ్రామాలకు చెందిన ఇంటి సతీష్, నక్కాల అప్పయ్య, నక్కాల అప్పలనాయుడు, నక్కాల అప్పన్న, కొర్నాన ఆదినారాయణ, తదితర 50 కుటుంబాలకు చెందిన వారందరికీ బొత్స సందీప్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ, సంక్షేమ పాలనకు మెచ్చి చాలామంది పార్టీలో చేరుతున్నారని చెప్పారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమన్నారు.

అండగా ఉన్నవారిని గెలిపించండి



కళ్లేపల్లి ఇంటింట ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వరలక్ష్మి

లక్కవరపుకోట: ప్రజలకు అందుబాటులో ఉంటూ, కష్టసుఖాల్లో పాలుపంచుకునే వారిని గెలిపించాలని ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ తూర్పాటి వరలక్ష్మి , వైఎస్సార్‌సీపీ మండల నాయకులు కోరారు. మండలంలోని కళ్లేపల్లి గ్రామంలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విశాఖపట్నం వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, ఎస్.కోట ఎమ్మెల్యే అభ్యర్థి కడుబండి శ్రీనివాసరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ప్రచార పర్వం

ఇంటింటి ప్రచారం



వేపాడ: బొద్దాంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ సత్యవంతుడు తదితరులు

మండలంలోని బొద్దాంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ సత్యవంతుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ముమ్మలూరి జగ్గుబాబు, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గంగునాయుడు, జేసీఎస్ కన్వీనర్ బోజంకి శ్రీను పాల్గొన్నారు. అలాగే పెద దుంగాడ, చిన దుంగాడ వీలుపర్తి గ్రామాల్లో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, సర్పంచ్ బీల రాజేశ్వరి, సతీష్ దంపతులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ప్రచారం నిర్వహించారు.

– వేపాడ

సమయం ఆసన్నమైంది..



నిమ్మలవలసలో ఉపాధి హామీ వేతనదారులకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరుతున్న డాక్టర్ బొత్స సందీప్

ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో సంక్షేమ పాలన అందించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి అండగా నిలవాల్సిన సమయం ఆసన్నమైందని మంత్రి బొత్స సత్యనారాయణ కుమారుడు డాక్టర్ బొత్స సందీప్ అన్నారు. మండలంలోని నిమ్మలవలస, దేవరపొదిలాం గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధి వేతనదారులను నేరుగా కలిసి ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యాల్సిన ఆవశ్యకతను వివరించారు. అదేవిధంగా మండలంలోని రావివలసలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, తదితరులు ఇంటింటి ప్రచారం నిర్వహించి, ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యాలని కోరారు.

– చీపురుపల్లి



రావివలసలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు

బాధ్యత మీదే..



తిమిటేరులో మాట్లాడుతున్న ఎంపీ సతీమణి బెల్లాన శ్రీదేవి, చిత్రంలో ఎమ్మెల్యే తనయుడు గురునాయుడు

సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపించుకునే బాధ్యత ఓటర్లపైనే ఉందని ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్ సతీమణి శ్రీదేవి, ఎమ్మెల్యే అభ్యర్థి బొత్స అప్పలనరసయ్య కుమారుడు గురునాయుడు అన్నారు. మండలంలోని టి.బూర్జవలస, భూపాలరాజపురం, తిమిటేరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్నికలప్పుడు వచ్చే నాయకులకు బుద్ధి చెప్పాలన్నారు. నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ సంక్షేమ పాలన అందించిన బొత్స అప్పలనరసయ్యను, బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరారు.

– దత్తిరాజేరు

ఇంటింటికీ మేనిఫెస్టో...



గరివిడి పట్టణంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రకటించిన మేనిఫెస్టో వివరాలను వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వివరిస్తున్నారు. గరివిడి పట్టణంలో జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ కొణిశ కృష్ణంనాయుడు, కొండపాలెం మేజర్ పంచాయతీ వైస్ సర్పంచ్ బమ్మిడి కార్తీక్, పి.కుమార్, రామకృష్ణ, తదితరులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

– చీపురుపల్లి రూరల్

పట్టం కట్టండి..



బిల్లలవలసలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎంపీపీ చలంనాయుడు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి తిరిగి పట్టం కట్టడం ద్వారా సంక్షేమ పథకాలు పొందడంతో పాటు రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని ఎంపీపీ చల్లాం చలంనాయుడు అన్నారు. మండలంలోని బిల్లలవలసలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా బొత్స అప్పలనరసయ్యతో పాటు ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌లను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొద్దల చిన్నంనాయుడు, జేసీఎస్ కన్వీనర్ పల్లి రఘు, నాయకులు నెట్టి ఆనంద్, నెట్టి ముకుంద, సుంకరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

– బొండపల్లి

అభివృద్ధి, సంక్షేమ పాలనకు మద్దతివ్వండి



ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ సూర్యనారాయణ రాజు

అభివృద్ధి, సంక్షేమ పాలనకు మద్దతివ్వాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ సూర్యనారాయణరాజు కోరారు. మండలంలోని దమరసింగిలో ఉపాధి హామీ వేతనదారులతో సమావేశమై, సంక్షేమ పాలన అందించిన జగనన్నను మరోసారి గెలిపించాలన్నారు. ఆయన వెంట మీసాల ప్రసాద్, శ్రీరామ్, రాజారావు ఉన్నారు.

– గుర్ల

ప్రచార హోరు...



జాగరంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు గొర్లె సరయు, తదితరులు

మండలంలోని జాగరం గ్రామంలో జెడ్పీటీసీ సభ్యురాలు గొర్లె సరయు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నేతలు ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించి రానున్న ఎన్నికల్లో మరోసాగి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యేగా కడుబండి శ్రీనివాసరావుకు, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మికి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి మద్దతు పలకాలన్నారు.

– జామి